# సమయంకాని సద్భావం

(కథానిక)

కొద్ది కాలంలో ప్రారంభించబోతున్న మా కొత్త సంసారానికి యిక్కణ్ణుంచే ఎవరైనా పనిచేసే కుర్రాణ్ణి తీసుకెళ్ళాలని నేనూ, రేణూ నిశ్చయించుకున్నాము. కూతురు ఎక్కడ యిబ్బంది పడుతుందోనని మా అత్తగారు "చూడు నాయనా! అమ్మాయి చిన్నపిల్ల. నువ్వు పగలల్లా కాలేజిలో వుంటే ఒక్కర్తే, అందులో పసిపిల్లతో వుండడం ఎంతో కష్టంగా వుంటుంది. ఎవరినైనా మన తెలుగు ప్రాంతంనుంచే నౌకరును తీసుకెడితే అమ్మాయికి సాయంగానూ వుంటుంది, చిన్న చిన్న పైపనులు చేయడానికి వీలుంటుంది" అని సలహా యిచ్చింది. గౌహాతి చాలా దూరప్రదేశం, అందులో తెలుగువాళ్ళు ఏదో ప్రత్యేకమైన పనిమీద వచ్చిన కొద్దిమందీ తప్పితే కనపడని దేశం కాబట్టి ఆ సలహా సహజంగానే తోచి మా అత్తవారింట్లో పనిచేసే లక్ష్మి తొమ్మిది ఏళ్ళ కొడుకు సూరిని వెంటతీసుకెడదామనుకున్నాము.

లక్ష్మి మొదట్లో సందేహించినా, చివరికి మా పట్టుదలవల్ల వాళ్ళ అబ్బాయిని మా వెంట పంపడానికి అంగీకరించింది. ఇంక సూరి సంతోషానికి పట్టపగ్గాల్లేవు. ప్రయాణం, కొత్త ప్రదేశాలు, అందులో రేణుతోను, నాతోనువుండడం యివన్నీ వాడి చిన్నిబుర్రని ఆనందంతో వుక్కిరిబిక్కిరి చేశాయి. వాడికి నాదగ్గిర, నేను మా అత్తవారింట్లో ప్రవేశించక ముందునుంచీ రేణు దగ్గిర ఎంతో చనువు. రేణుకూడ తనకు తీరుబడి అయినప్పుడల్లా వాడికి ఎక్కాలు, అ ఆలు, నేర్పుతూ, తనతో సినిమాలకి తీసికెడుతూ వాణ్ణి కూడా ఆ యింట్లో ఒక కావలసిన వాడుగా తిరుగనిచ్చేది. మా అత్తగారికి యీ మాత్రం స్వేచ్ఛ వాడికి యివ్వడం నచ్చకపోయినా, రేణు ఒక్కర్తే కూతురు కావడంవల్ల ఆమె పనులకు అడ్డొచ్చేదికాదు. బహుశా దీనివల్లనేమోగూడా లక్ష్మి సూరిని పంపడానికి అట్టే వెనుకాడలేదు.

తరువాత నేను మా అత్తవారి కుటుంబంలో అల్లుడుగా అడుగెట్టిన తరువాత సూరి నాకూ రేణుకు ఏర్పడ్డ సంబంధం గుర్తించినవాడల్లే ఆమె వద్ద చూపే చనువు నా దగ్గిరా వెళ్ళినప్పుడల్లా వ్యక్తపరుస్తుండేవాడు. "బాబుగారు" అంటూ నా వెంట తిరిగి నాకు కావలసిన చిన్న చిన్న పనులు ఎంతో శ్రద్ధగానూ, సంతోషంగానూ చేసిపెడ్తూండేవాడు. వాడి చురుకుతనం, అమాయికత్వం చూసి వాడికి తగిన అవకాశాలు లేకపోబట్టి కదా అటువంటి వ్యర్థజీవితాన్ని గడుపుతున్నాడని ఎంతో జాలివేసేది. పాపం తండ్రి లేడు; తల్లికష్టంమీదనే వాడూ, చెల్లీ, ఒక తమ్ముడూగూడ బ్రతకాలి. వేరే మొగదక్షత లేనందున వాడిని ఎక్కడైనా పనిలో చేర్పించడమన్నా పడలేదు. అసలు చదువు సంగతి వేరే చెప్పనక్కర్లేదు. రేణుదగ్గిర నేర్చిన ఏ కొంచెము తప్పితే వేరే ప్రవేశమేమీలేదు. ఇటువంటి పరిస్థితులలోవున్నవాడంటే జాలికల్గడం సహజమే అనుకొంటాను. ఆ జాలే వాడంటే నాకొక అభిమానం ఏర్పడడానికి నాంది అయింది.

సూరిగూడా మాతో వుంటాడంటే ఎంతో సంతోషంగా వుంది. అదివరకల్లా వాడిమీదవున్న జాలి, యిష్టం యిప్పుడొక కార్యాచరణరూపం తీసుకోడానికి చక్కటి అవకాశం ఏర్పడబోతోంది. నేను, రేణు, మా బేబివున్న మా చిన్నసంసారం వాడికి చిరపరిచితమే; వాడు చేయాల్సిన పనులు చాల తక్కువ. నేను కాలేజికి వెళ్ళిపోగానే యింట్లోపని దాదాపు స్తంభించి పోయినట్లే. మా యింటావిడకు తోడుగావుండి, బేబీని ఆడించడమే వాడిపని. ఈ తీరిక సమయంలో రేణు వాడికి శ్రద్ధగా రోజూ చదువుచెప్పి కొంతకాలానికన్నా వాణ్ణి తనకాళ్ళమీద నిలబడేటట్టు

జె. వి. యస్. రామశాస్త్రి

చెయ్యొచ్చు. నాకు వీలున్నప్పుడు రేణు కార్యక్రమంలో సహాయం చేస్తూ వాడికి యింతవరకూ జీవితంలో పైకిరాలేని అవకాశాన్ని కలిగించొచ్చు.

ఈ ప్రణాళికను మా శ్రీమతి వెంటనే ఆమోదించింది. "నేనూ యింతవరకూ చదువు నేర్పుతుండడంలో వుద్దేశ్యం అదే. ఇక మీరుకూడా నాతోనే వుంటారు కాబట్టి వాణ్ణి పైకితీసుకరావడానికి మీ సహాకారం ఇంకా వుపకరిస్తుంది. ఐనా అబ్బాయిగారికి విద్యార్థి జీవితాన్ని వదలి నాల్గుసంవత్సరాలైనా కాన్వొకేషన్ ప్రసంగాల ప్రభావం వదలనట్టుందే" అని గడ్డంక్రింద నాజూకైన వేళ్ళనిపెట్టి కొంటెగా నవ్వింది.

తరువాత సూరినిపిల్చి నెమ్మదిగా వాణ్ణి గురించిన మా ఆలోచనలు చెప్పాను. చదువనేటప్పటికి వాడిమొహం విప్పారింది. వాడిలోవున్న సహజమైన కుతూహలం మా చేతిలో ఒక పద్ధతిలో రూపొంద బోతోందని, సంతోష భారంతో "తప్పకుండా వస్తాను...మీరేం చేయమంటే అది చేస్తాను" అని సిగ్గుతో క్లుప్తంగా తన కోర్కెను వెలిబుచ్చాడు.

సామాన్లన్నీ కారులోపెట్టించి నేను, ఒళ్ళో బేబిని కూర్చోపెట్టుకున్న రేణుతోపాటు వెనుక సీట్లలో కూర్చుని మా మామ, అత్తగార్లతో మాట్లాడుతూ ఫర్ ప్రక్కన కూర్చున్న సూరిని, వాడితో మాట్లాడుతున్న లక్ష్మిని అనుకోకుండా చూసాను. నా చూపు ఎందుకో వెనుకకు మరలలేకపోయింది. లక్ష్మికళ్ళల్లో ఏదో చెప్పలేని మూగబాధ స్పష్టంగా కనపడుతూంది. తడబడుతున్న చేతివ్రేళ్ళని కొడుకు తలలోదూర్చి "అల్లరి చేయకుబాబూ! బాబుగారు, అమ్మగారు చెప్పినట్లు వింటూవుకదూ!" అంటూంది. నెమ్మదిగా దృష్టిని రేణు ఒళ్లో కేరింతాలు కొడుతున్న బేబీవేపు మరలించాను. హఠాత్తుగా ఒక విషయం ఆలోచనలో మెరిసింది: ఇదివరకెన్నడూ నా ఆలోచనా పరిధిలో ప్రవేశించని ఆ విషయం నా మనస్సును ఎంతో కలవర పెట్టసాగింది. సూరిని నేను ఎంతో సదుద్దేశంతో తీసుకెళుతున్నా, వాడికీ వాడి తల్లికీమధ్య పెనవేసుకొన్న అనురాగసంబంధానికి నేనుతగిన శ్రద్ధ చూపలేదేమో! తల్లినుండి దూరంగా తీసుకపోయి నిజంగా వాడి జీవితానికి కలిగించబోయే ఉపకారానికి బదులు ఏదైనా కొత్తఖేదం, నష్టంకలిగిస్తానేమో!

జీవితాన్ని ఉన్నతస్థాయికి గొనిపోవడానికి విద్యతప్పితే ప్రేమ, మమకారాల ప్రభావం ఎంత? వాటిని సరిదిద్ది హృదయం మానవత్వంతో తొణికిసలాడడానికి తల్లికన్నా మార్గదర్శకులెవ్వరు? ఇతరులు వర్షించేవాత్సల్యము, కరుణ హృదయం సంక్షోభిస్తే. ప్రత్యేకంగా చిన్న వయస్సులో, ఎంతవరకు వుపశాంతి నిస్తాయి? అసలు కొంచెమైనా పూరతుకలిగించగలవా? ఈ విధంగా సూరిని దృష్టిలోపెట్టుకొని ఎంత ఆలోచించినా, నా తూకంలో మాతృస్థానానికి ఏవీ సరిరావటంలేదు. ఎంతకీ ఆలోచనలు ఒకదరి చేరలేకపోతున్నాయి. అయితే వాణ్ణి యిక్కడే వదలిపెట్టితే వాడు అలవాటుపడి ఇంతవరకు గడుపుతున్న జీవితం వాణ్ణి ఏపక్కకు తీసుకెడుతుంది? ఏమాత్రం ఆశాజనకంగా లేని వాడి భవిష్యత్తును నా శక్తికొద్దీ వెలుగొందేటట్లు చేయటం, వాడికి ఒక నూతన జీవితపథం చూపించటం తప్పా? రేణుకు గూడ వాడంటే ప్రేమ, జాలివున్నాయి; అందులో కొత్తగా తల్లిఅయింది; వాడి పసిహృదయపు నడకలను సులువుగా అర్థంచేసుకోగలదు. వాడిజీవితం సుఖవంతంగా గడవడానికి ఆమె సానుభూతి సహాయపడుతుంది. మళ్ళా ఇంకొక ఏడాదికల్లా సెలవలు ఇచ్చినప్పుడు తల్లిదగ్గర కొచ్చెయచ్చు. మొదటి సంవత్సరపు జీవితమే వాడికెంతో ఆత్మవిశ్వాసం సమకూర్చి శేషించిన జీవితాన్ని స్వయంగా సరిదిద్దుకోవడానికి పునాది వేస్తుంది. ప్రశ్నలతోను, సమాధానాలతోను మెదడు వేడెక్కుతోంది. విభిన్నమైన ఈ రెండు రకాల శక్తులలో దేనికీ స్పష్టమైన విజయం చేకూరలేదు. ఈ మానసిక భీభత్సానికి స్వస్తివాక్యం చెప్పడానికి, నన్ను నేనుసరిగా సమాధాన పరుచుకోలేకపోయినా, వాడితో ప్రయాణం సాగించడానికి సాహసించ దలిచాను.

* * *

మేము గౌహాతి చేరేటప్పటికి రాబోయేనూత్న జీవిత వాహిని సౌందర్యపు టాలోచనలు, ఎదురుచూస్తున్న వింత అనుభూతుల మాధుర్యం

రేణునుంచి ఆమె రెండురోజులక్రింద లోనయిన వియోగ విషాదాన్ని రైల్లోనే వదలిపెట్టేటట్లు చేసినయి. ఆమె కలలు నిజం కాబోతున్నట్లు మా యింటిపక్కనవున్న బెంగాలీ కుటుంబంవారు యీ "బహురాణి"కి బేబీకి యిచ్చిన స్వాగతం ఆమెను ఆనందంతో పరవశం పొందించినయి. సూరిగూడా రైళ్లు ఎత్తైనపర్వతాలు, కొత్త భాషలతోను, వేషాలతోను వున్న ప్రజల్నిచూసి, తనేదో వింతైన సుందరలోకంలోకి వచ్చినట్లు వుత్సాహంతో వురకలు వేస్తున్నాడు. జీవితంలో భాగం పంచుకోడానికి, ప్రపంచపు ఎత్తుపల్లాలలో చేయూతనివ్వడానికి, సహధర్మచారిణి అనే పేరు అక్షరాలా ఆచరణలో పెట్టేందుకు రేణు; మా యిద్దరి గడిచిన సుఖజీవితపు ప్రతిబింబము మా బేబీ; మా సంస్కారంవల్ల జీవితంలోని ఆశలను కలలుగా వుండకుండా నిజాలుగా నిర్మించుకుందామని ఆత్రుతతోవున్న అమాయిక బాలుడు సూరి—నాతోవుండి అందరి మనగడలు ఆనందంతో నింపడానికి ఎదురు చూస్తున్నారనే మధురభావన నన్నెంతో మురిపించింది. ఇంత సంతోషంతోను, సంరంభంతోను వున్న మా మనస్తత్వాలు మా చిన్నకుటుంబం సుఖంగా స్థిరపడడానికి చాల దోహదమిచ్చాయి. ప్రత్యేకంగా సూరి వుత్సాహాన్ని చూసిన తర్వాత యీ కొత్త జీవితానికి చాలా త్వరగా అలవాటుపడి వాణ్ణిగురించిన మా వుద్దేశాలకు జీవం పోస్తాడనే ఆశకల్గింది. రెండునెలలు మాకు తెలియకుండానే గడిచిపోయినయి.

ఒకరోజున నేను కాలేజినుంచి యింటి కొచ్చేటప్పటికి సూరి ఒక్కడూ వాకిట్లో కూచుని వున్నాడు. మొహం చూస్తే దీన్నిగురించో చాలా సేపటినుంచి దీర్ఘంగాఆలోచిస్తున్నట్లుంది. ఎప్పుడూ నవ్వుతూ, గెంతుతూ వుండేవాడు ఆ సమయాన అట్లావుండడం నాకు కొంచెం ఆశ్చర్యం కలిగించింది. సతీమణి ఆ రోజున చెప్పిన పాఠాలను తీవ్రంగా నెమరువేస్తున్నాడేమో అనుకొని నవ్వుకొని లోపలికి వెళ్ళబోతుంటే "బాబూ". అని వెనుకనుంచి పిలుపు వినిపించింది. పరిచితమైన ఆ కంఠంలోంచి వచ్చిన ఆ పిలుపు నా కెందుకో వింతగా ధ్వనించింది. వెనుకకి తిరిగి వాడిదగ్గరకి వెళ్ళాను. "ఇంక కొద్దిరోజులలో దసరా సెలవులు యిస్తారని అమ్మగారు చెప్పారు. ఇంటికి వెడతారా?" అన్నాడు. ఇంటిమీదకి గాలి మళ్ళిందని, "కొత్త వింత పాత రోత" అనే సామెత నిజం అవబోతోందని గ్రహించడానికి ఆట్టేసేపు పట్టలేదు. "వెడదామనుందా?" నిశ్శబ్దం సమాధానంఅయి కూచుంది.

మరునాడు "మీరూ, అమ్మగారూ, పాపాయి తప్పితే మనవాళ్లు ఎవరూ యిక్కడ కనపడరండీ!" అనే బాధ కలిగించే సత్యాన్ని జాలిగా బయటపెట్టాడు. అంతవరకూ చాల చురుకుగా చదువుకొంటూ, బేబీతో ఆడుకుంటుండేవాడు తరచు దేన్నిగురించో వేదనపడుతూ, మందగొడిగా వుంటున్నాడు. వాడి పరిస్థితిలోని పరిణామాలను పరికించింది రేణుగూడ. సలహాకొచ్చింది "ఏం చేద్దామండీ" అంటూ. ఉపేక్ష అపాయకరమని గ్రహించాను. నెమ్మదిగా బుజ్జగిస్తూ "ఏంరా! అమ్మను చూద్దామనుందా? ఇంటికెడతావా?" అన్నా సూరితో. అమ్మపేరు వినేటప్పటికీ ఎంత కాలంనుంచో భూగర్భంలోవున్న లావాద్రవంవలె ఒక్కసారి దుఃఖం పొంగుకొచ్చింది వాడిలోంచి. రెండుచేతులడ్డంపెట్టుకొని ఏడవడం మొదలుపెట్టాడు. రేణు దగ్గరకు తీసుకొని, కళ్ళుతుడిచి, "ఛా! తప్పుకదూ! అలా ఏడవచ్చా? చెప్పమ్మా, యింటికెడతావా!" అని లాలించింది. బొటనవేలు నేలకిరాస్తూ నెమ్మదిగా తలఆడించాడు అంగీకారసూచకంగా.

ఒక్కణ్ణీ ఎలాపంపిచడమూ, అంతదూరం ఒంటరిగా ప్రయాణం చేయగలడా అని సందేహించి ఎవరైనా మద్రాసువైపు వెళ్ళేవాళ్ళకోసం అన్వేషణ సాగించాను. అది ముగియక పూర్వమే వాడికి పెద్దపెట్టున జ్వరం వచ్చేసింది. దానికితోడు గట్టిగా అమ్మనుగురించి పలవరిస్తూ ఏడుస్తున్నాడు జ్వరంలో. డాక్టర్ "గాభరాపడవలసిందేమీ లేదు. తగ్గడానికిమటుకు కొన్నిరోజులు పడుతుంది" అన్నప్పటికీ మా ధైర్యం సడలిపోయింది. జ్వరతీవ్రత, పలవరింతలూ మమ్మల్నెంతో ఆందోళన పరుస్తున్నాయి. ఎందుకో దోషులుగా బాధపడ్తున్నాం. నాలోవున్న సహజలక్షణాలు నన్నుబయటపడకుండా చేస్తున్నాయి

కాని రేణు నిబ్బరం పూర్తిగా విడిపోయింది. "వాడు వెడతానన్నరోజునే పంపిస్తే యీ వుపద్రవం రాకపోవును కదండీ" అంటూ ఎంతో కుమిలిపోయేది. "మనం ఏం లోపం చేసేమండీ. మనదగ్గిర వుండలేక పోతున్నాడేం?" అని అమాయికంగా అడిగేది. తనవల్ల లోపం ఏమన్నా జరిగిపోయిందేమోనని వాడికి తగిన ఆదరం, శ్రద్ధ చూపించలేక పోయానేమోనని, దానివల్లే వాడింటికి పోతానన్నాడేమోనని అనుమానించేది. అంతేకాని వాడు నిజంగా దేన్ని వాంఛించి వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాడో కారణం వూహించలేక పోయింది. ఆమెలో వున్న మాతృహృదయం ఆమె ఆందోళనను అధికం చేసింది. "రేణూ, నువ్వు అనవసరంగా బాధ పడుతున్నావు. నీవల్ల లోపమేదీ జరుగలేదు. నువ్వేదో కష్టం కలిగించాననుకోటం శుద్ధ పొరపాటు. వాడికి కావలసింది దయగల్గిన యజమానురాలు కాదు; ఆదర్శపూరిత యజమాని అంతకన్నా కాదు. సూరి మనల్ని ఆ స్థానాలనుంచి పైకెత్తి ఆత్మీయులలో చేర్చలేకపోయినాడు. అది వాడి తప్పూ కాదు; ఆ వయస్సులో కావలసిందీ కావాలని వాంఛించేదీ కని, పెంచి, ప్రేమించేతల్లి. ఆమె గాఢపరిష్వంగమే వాడి ఆవేదన చల్లార్చేదీ, వుత్సాహపరిచేదీను. మన వాత్సల్యం, అభిమానం వాడికి యివ్వగలిగిన వూరడింపు చాల తక్కువ. ఇప్పుడు మనం చేయగల్గింది మనమేదో చేసామనీ, చెయ్యలేదనీ బాధ పడ్డంకాదు. వాడికి కావలసింది సాధ్యమైనంత త్వరలో సమకూర్చడమే" అనేటప్పటికి ఏదో తెలియని సత్యం గ్రహించినట్లు ఆమె నయనాలు నూతనకాంతితో మెరిసాయి. వాళ్ళనాన్నగారికి సూరి పరిస్థితి వివరిస్తూ, లక్ష్మిని పంపమని ఆ సాయంత్రమే టెలిగ్రామిచ్చింది.

లక్ష్మివచ్చిన రెండురోజులలో సూరి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. మరి నాల్గురోజులకు వాళ్ళిద్దరను పంపడానికి నేను, రేణు స్టేషన్‌కు వెళ్ళాము. వాళ్ళు కంపార్టుమెంటులో కూర్చున్న తరువాత, అంతవరకూ ఆరని ఆవేదనను చల్లార్చేందుకు, మనస్సును తేలిక పరిచేటందుకు ప్రారంభంనుంచి వున్న నా భావసంఘర్షణను లక్ష్మికి విశదపర్చాలనిపించింది. ఎదురుగుండా లక్ష్మి, కాదు, ఒక దెబ్బతిన్న మాతృవదనం కనిపిస్తోంది. సూరిని యిక్కడకు తీసుకరావటంలో ఆంతర్యాన్ని చెప్పుకోమని మనస్సు తొందర పెట్టింది. "నేను సూరిని ఒక పనిచేసేకుర్రాడిగా మా వెంట యిక్కడకు తీసుకరాలేదు. వాడికి నీ దగ్గరవుండేవాటికన్నా ఎక్కువ అవకాశాలను కల్పించి వాడి భవిష్యత్తు ఆశాజనంగా తయారు చెయ్యవచ్చునే కోరిక బలీయంగా వుండడంవల్ల నిన్నడిగి వాణ్ణి తీసుకొచ్చాం. కాని ఒక విషయాన్ని ఆ సమయంలో విస్మరించాను. అంత చిన్నవయస్సులో కొడుకుని వాడితల్లిదగ్గరనుంచి, వాడి మంచికోసమైనాసరే, తీసుకవెళ్ళడంవల్ల వాడి లేతమనస్సుమీద ఆ వియోగం కల్పించే ఫలితాల తీవ్రతను నేను గుర్తించలేకపోయాను. బయలుదేరేముందు నిన్నూ సూరినీ చూసి, రేణు వడిలోవున్న బేబీని చూసిన తర్వాత నాకీ విషయం ఒక మెరుపువలె స్ఫురించింది. ఎంత ఆలోచించినా "సూరి జీవితపు బాగుకోసం నువ్వు చేసే పని యిక్కడనుంచి వాణ్ణి తీసుకువెళ్ళడంవల్ల కలిగే నష్టంకన్నా ఎంతో విలువైంది" అని నా మనస్సిచ్చిన సమాధానం నన్ను తృప్తిపరచింది. మరుక్షణంలోనే మళ్ళా సందేహం వచ్చింది నేను చెయ్యబోయే పనియొక్క ఫలితాల్ని గురించి. కాని అప్పటికి సమయం మించిపోయింది. నేను ఆ సందిగ్ధావస్థలోంచి స్పష్టంగా బయటపడకముందే మనస్సు నన్ను తాత్కాలికంగా సమాధానపరిచింది. ఇక్కడికొచ్చిన రెండు నెలలకు తెలిసింది నా మనసు ఇచ్చిన సమాధానం నిజంకాదని. నేను ఆదర్శాలకు పోయి మాతృత్వపు విలువలను మరిచిపోయాను; ఆ విలువలను లెక్కించడంలో పొరపాటుపడ్డాను. నీ ప్రేమ వాడిమనస్సుకు యిచ్చే మృదుత్వం, మానవత్వం ఎవరూ యివ్వలేరు. దానికంటె నిజమైన విద్య, సంస్కారం ప్రపంచంలో యింకేదీలేదు. వాడి పసిగుండెనీ, నీ మాతృహృదయాన్ని తెలియక గాయపర్చినందుకు క్షమించు" అంటుంటే రైలు కదిలింది. అకస్మాత్తుగా వచ్చిన నా మాటల ఒరవడికి నివ్వెరపోయి లక్ష్మి అంటున్న మాటలేవో యింజనుకూతలో కలిసిపోయాయి. ★